సాక్షి అనకాపల్లి

ఆదివారం । 20 । జూలై । 2025



ఇదేం తీరువా బాబూ

నీటి తీరువా బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ కావడంతో అన్నదాతలు ఆగ్రహిస్తున్నారు. 8లో



ప్లాస్టిక్ భూతం

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్‌పై పోరాటానికి కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. 8లో



టీడీపీ నేత అరెస్ట్ 8లో

చిట్టీలు, వడ్డీల పేరిట మోసగించిన టీడీపీ నాయకుడు దాడిశెట్టి ఫైడియ్యను అరెస్టు చేశారు. అతనితో సమాధానం చెప్పించాలని బాధితులు ఆందోళన చేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా ముగ్గురికి అవకాశం



దంతులూరి



పైలా



చిక్కాల

విశాఖ సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు (పార్లమెంట్)గా అనకాపల్లి జిల్లాలో ముగ్గురికి అవకాశం దక్కింది. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలను చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. రాష్ట్ర కార్యదర్శులుగా దంతులూరి దిలీప్ కుమార్ రాజు, పైలా శ్రీనివాసరావు, చిక్కాల రామారావు నియమితులయ్యారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను వీరికి కేటాయించనున్నట్లు కేంద్ర కార్యాలయం తెలిపింది. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజనల్ కో–ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకులుగా వ్యవహరిస్తారని పేర్కొంది.

27న జిల్లా స్థాయి యోగా పోటీలు

పరవాడ: అనకాపల్లి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న వెన్నలపాలెం బండారు అప్పలనాయుడు ఏసీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహించనున్నట్లు అనకాపల్లి యోగాసన కార్యదర్శి సీహెచ్.ఆంజనేయులు, అధ్యక్షుడు పి.రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన అభ్యర్థులు ఆగస్టులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనదలచిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా 9398740982 నంబరుకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ గర్హనీయం

- మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



కె.కోటపాడు: సిట్ విచారణకు హాజరైన ఎంపీ మిథున్‌రెడ్డిపై దౌర్జన్యంగా కేసు బనాయించి అరెస్టుకు పాల్పడడం అన్యాయమని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌ను ఆయన ఖండించారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక చంద్రబాబు ఇటువంటి కుట్రలకు తెరతీసినట్లు ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తుందనడానికి మిథున్‌రెడ్డి అరెస్టే నిదర్శనమన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా కక్షపూరితంగా అరెస్ట్ చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేస్తున్నారన్నారు. దీన్ని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇటువంటి కుట్ర రాజకీయాలకు తెరతీశారని దుయ్యబట్టారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనల్లో జన సందోహాన్ని చూసి చంద్రబాబుకు నిద్ర పట్టడం లేదన్నారు.



సరుగుడు జలపాతంలో నీటి ప్రవాహం

- టూరిస్టులను ఆకట్టుకునే సుందర జలపాతం
- పర్యాటక కేంద్రంగా మార్చుతానన్న అయ్యన్న
- నేటికీ అటువైపు చూడని వైనం
- సదుపాయాలు లేక సందర్శకుల ఇబ్బందులు
- అభివృద్ధి చేస్తే గిరిజనులకు ఉపాధి అవకాశాలు

ఉమ్మడి జిల్లా విభజన తర్వాత అనేక పర్యాటక ప్రదేశాలు అటు విశాఖ, ఇటు ఏజెన్సీ ప్రాంతంలో ఉండిపోయాయి. కొత్త జిల్లా అనకాపల్లిలో మిగిలిన కొద్దిపాటి పర్యాటక ప్రాంతాల వైపు కూటమి పాలకులు కన్నెత్తి చూడటం లేదు. దాంతో పర్యాటకంగా అభివృద్ధి చెందకపోగా, అసౌకర్యాలతో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. సరుగుడు జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదు.

అడవి కాచిన సరుగుడు అందాలు



తుప్పలతో జలపాతానికి వెళ్లే ప్రధాన రోడ్డు

నాతవరం:

సరుగుడు జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు హామీ ఆచరణలో అమలు కాలేదు. గతేడాది డిసెంబరు 24న సుందరకోట, అసనగిరి గ్రామాల రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామసభలో సరుగుడు జలపాతంపై గిరిజనులు విన్నవించగా, దానికి స్పందించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఇప్పటికి నెలలు గడుస్తున్నా అటు వైపు కన్నెత్తి చూడలేదు.

మట్టిరోడ్డులో వెళ్లలేక ఇబ్బందులు

ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్య లోంచి జాలువారే జలపాతాన్ని చూసేందుకు ఉమ్మడి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. సరదాగా కాలక్షేపం చేసేందుకు ఇక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం కనువిందు చేస్తోంది. అక్కడకు వెళ్లడానికి కనీసం రోడ్డు సదుపాయం లేదు. సరుగుడు నుంచి సుందరకోట వెళ్లే వరకు మాత్రమే తారురోడ్డు నిర్మించారు. సరుగుడు, సుందరకోట గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో ఈ జలపాతం ఉంది. సుందరకోటకు వెళ్లే రోడ్డు మధ్యలో కుడి వైపు నుంచి జలపాతానికి వెళ్లాలి. అక్కడ్నుంచి గుంతలతో కూడిన మట్టిరోడ్డు కావడంతో ఏమాత్రం వర్షం పడినా బురదమయంగా మారుతోంది. మార్గంమధ్యలో గెడ్డ నీటిలో దాటుకుంటూ సందర్శకులు వెళ్తుంటారు. కొన్నిసార్లు సందర్శకులు మార్గం తెలియక తికమక పడుతుంటే, గిరిజనులు తాటిదుంగలతో ముఖ ద్వారం ఏర్పాటు చేశారు.



జలపాతానికి వెళ్లాలంటే ఈ గెడ్డ దాటాల్సిందే..

దుస్తులు మార్చుకోవాలంటే చెట్ల చాటుకు..

జలపాతం వద్ద స్నానాలు చేసి దుస్తులు మార్చుకోవడానికి నిర్మించిన షెడ్డు పూర్తిగా శిథిలమైంది. ఇదే కూలే స్థితిలో ఉంది. దాంతో చెట్ల మాటున మహిళలు దుస్తులు మార్చుకుంటున్నారు. ఆ సమయంలో ఆకతాయిలు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి ఎక్కడ సోషల్ మీడియాలో పోస్టు చేస్తారోనని భయపడుతున్నారు. జలపాతం దిగువ భాగంలో ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్ శిథిలమయ్యాయి. దాంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో పర్యాటక శాఖ అధికారులు రూ. 10 లక్షలతో నిర్మించిన షెడ్డు నిర్వహణ లేక అధ్వానంగా దర్శనమిస్తోంది. జలపాతానికి వేలాది మంది వస్తుండగా, అక్కడ కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. ఈ ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే గిరిజనుల జీవనోపాధి మెరుగు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థలో దుస్తులు మార్చుకునే షెడ్డు

అభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలు



జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే మా గిరిజన గ్రామాలు బాగుపడతాయి. గిరిజనులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశిస్తున్నారు. మా ప్రాంత గిరిజనులు కోరిక మేరకు సుందరకోట సభలో నేను స్పీకరు దృష్టికి తీసుకెళ్లాను. పర్యాటక కేంద్రంగా చేస్తే అనంతగిరి, లంబసింగి మాదిరిగా సందర్శకులు వస్తారు.

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, నాతవరం

గురి తప్పిన హత్యాయత్నం

- ఒకరి బదులు మరొకరిపై దాడి
- మద్యం మత్తులో కిరాయి రౌడీల నిర్వాకం
- విరోధి హత్యకు కుట్ర పన్నిన నిందితులు
- ఈ ఘటనలో వాచ్‌మన్‌కు తీవ్ర గాయాలు
- ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు



నిందితులతో డీఎస్పీ మోహన్‌రావు, ఇతర పోలీసు అధికారులు

ఎస్.రాయవరం: కిరాయి గూండాల గురి తప్పింది. తాగిన మైకంలో ఒకరి బదులు మరొకరిపై హత్యాయత్నం చేశారు. హత్యకు మరోసారి యత్నించిన క్రమంలో అసలు సూత్రధారులతో సహా పోలీసులకు చిక్కారు. ఇన్‌చార్జి డీఎస్పీ మోహన్‌రావు అడ్డురోడ్డు సర్కిల్ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. అడ్డురోడ్డుకు చెందిన ఓ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరి హత్యకు కుట్ర పన్నిన కిరాయి రౌడీలు.. ఈనెల 11న ఆయన బదులు పొరపాటున వెంకటేశ్వర కల్యాణమండపం వాచ్‌మన్ నాగేశ్వరరావు తలపై రాడ్డుతో కొట్టి చంపబోయారు. అపస్మారకస్థితికి చేరుకున్న నాగేశ్వరరావును చూసి అతని భార్య, పిల్లలు కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి పరిస్థితి ఇప్పటికీ విషమంగా ఉంది.

అసలు విషయమేంటంటే..

ఈ కేసులో ఏ1 నిందితురాలిగా ఉన్న ఎస్.రాయవరానికి చెందిన నూకేశ్వరి కుటుంబ తగాదాల కారణంగా మూడేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయింది. భర్తపై తరుచు పోలీస్ స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదులు చేసేది. ఆ సమయంలో అడ్డురోడ్డుకు చెందిన విలేకరి ఆమెకు పరిచయమై పోలీస్ స్టేషన్‌కు తోడు వెళ్లేవాడు. ఆమె వద్ద నుంచి కొంత డబ్బులు, ఆరున్నర తులాల బంగారం తీసుకున్నాడు. ఆ తర్వాత ఆయన సహకరించకపోవడంతో తన నగదు, బంగారం తిరిగి ఇచ్చేయాలని నూకేశ్వరి అడిగింది. దానికి ఆ విలేకరి నిరాకరించడంతో అతనిపై కూడా ఆమె పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు చేయడం మొదలు పెట్టింది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య వైరం మరింత పెరిగింది. ఆ విలేకరి నూకేశ్వరి ఇంట్లోను, ఆమెకు సన్నిహితుడైన బర్రె పైడిరాజు (ఏ 2) ఇంట్లోను.. వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఉందని చెప్పి తగువులు పెట్టాడు. దీంతో నూకేశ్వరి, పైడిరాజు కలిసి తునికి చెందిన శామ్యూల్ అలియాస్ శ్యాము (ఏ 3), ఈసరపూడి జాన్‌ప్రసాద్ అలియాస్ శవాలు (ఏ 4), రాయుడు రాజ్‌కుమార్ (ఏ 5)లతో విలేకరి హత్యకు రూ.లక్ష సుపారి ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కిరాయి రౌడీలు అడ్డురోడ్డు వచ్చి మద్యం తాగి విలేకరిని చంపబోయి కల్యాణ మండపంలో నాగేశ్వరరావును కొట్టారు. దాడి జరిగింది విలేకరిపై కాదని తెలుసుకున్న నూకేశ్వరి, పైడిరాజు దాడి చేయమని వారిని మళ్లీ పంపారు. అందరూ కలిసి అడ్డురోడ్డు వచ్చారు. అప్పటికే పరిసర ప్రాంతాల్లో నిఘా ఉంచిన పోలీసులకు శుక్రవారం సాయంత్రం అడ్డురోడ్డు శివారులో పట్టుబడ్డారు. అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ విభీషణరావు చాకచక్యంగా సిబ్బందితో ఐదుగురిని ఒక్కసారిగా పట్టుకుని అరెస్టు చేశారు. శనివారం రిమాండ్‌కు తరలించారు.

అటవీ సిబ్బందికి రక్షణ కరువు

- ఫారెస్టు భూమిలో రోడ్డు పనులను అడ్డుకుంటే దాడికి దిగిన నిర్మాణదారులు
- ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోని పోలీసులు
- విధి నిర్వహణను అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి
- అటవీ ఉద్యోగుల సంఘం డిమాండ్



డీఎఫ్‌వో శామ్యూల్‌కు వినతిపత్రం అందజేస్తున్న అటవీ ఉద్యోగుల సంఘం నాయకులు

నర్సీపట్నం: విధి నిర్వహణలో ఉన్న అటవీ సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ జూనియర్ అటవీ అధికారుల అసోసియేషన్ నర్సీపట్నం యూనిట్ సభ్యులు శనివారం డీఎఫ్‌వో శామ్యూల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న మాకవరపాలెం మండలం యరకన్నపాలెం నుంచి యలమంచిలి జాతీయ రహదారిని కలుపుతూ రోడ్డు వేస్తుండగా అటవీ అధికారులు అడ్డుకున్నారు. ఫారెస్ట్ భూమిలో రోడ్డు వేయడానికి కుదరదని సెక్షన్ ఆఫీసర్ వివేకానంద, బీట్ ఆఫీసర్ నూకరాజు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ సంధ్యారాణి అడ్డుకున్నారు. కంపార్ట్‌మెంట్ నెంబరు 1158 ప్రకారం రోడ్డు వేస్తున్న భూమి అటవీ భూమి అని ఫారెస్ట్ అధికారులు నిర్మాణదారులకు స్పష్టం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా 500 మీటర్ల వరకు రోడ్డు వేయడాన్ని తమ సిబ్బంది అడ్డుకున్నారని డీఎఫ్‌వోకు వివరించారు. రోడ్డు వేసేందుకు తీసుకొచ్చిన వాహనాలను సీజ్ చేస్తే నిర్మాణదారులు దౌర్జన్యంగా విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు సిబ్బందిపై దాడికి పాల్పడి వాహనాలను తీసుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై మాకవరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో వివరించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి రక్షణ లేకపోతే ఉద్యోగాలు చేయటం కష్టమని సంఘం ప్రెసిడెంట్ ఎం.సింహాచలం, వైస్ ప్రెసిడెంట్ కిరణ్, జనరల్ సెక్రటరీ బాబూరావు, గోపి, సంధ్యారాణి డీఎఫ్‌వో దృష్టికి తీసుకువెళ్లారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి రక్షణ లేకపోతే ఎలా అని, దాడికి పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోకపోతే విధులను స్తంభింపజేస్తామని వినతిపత్రంలో పేర్కొన్నారు.

తేలికపాటి వర్షంతో కాస్తంత ఊరట

- చోడవరంలో 40.6 మి.మీ. అత్యధిక వర్షపాతం



కె.కోటపాడులో జలమయమయిన రహదారి

తుమ్మపాల: నిన్నటి వరకు తీవ్ర ఎండలతో బెంబేలెత్తించిన వాతావరణం శనివారం కాస్త చల్లబడింది. జిల్లాలో పలుచోట్ల తెల్లవారు నుంచి మధ్యాహ్నం వరకు తేలికపాటి వర్షం కురిసింది. కొన్ని రోజులుగా కాస్తున్న తీవ్ర ఎండలకు ఎక్కడ చినుకులు అక్కడే భూమిలో ఇంకిపోవడంతో లెక్కల్లో నమోదైన వర్ష ప్రభావం కనిపించలేదు. దాంతో నేల పొడిగానే దర్శనమిస్తోంది. అన్నదాతలకు నిరాశే మిగులుతోంది. జిల్లాలో శనివారం తెల్లవారు నుంచి మోస్తరు వర్షం కురిసింది. వాతావరణ శాఖ లెక్కల ప్రకారం 309 మిల్లీమీటర్ల వర్షం పడింది. అత్యధికంగా చోడవరం మండలంలో 40.6 మిల్లీమీటర్లు కాగా, అత్యల్పంగా మునగపాక మండలంలో 0.6 మిల్లీ మీటర్లు నమోదైంది.

వర్షపాతం వివరాలివీ..

చోడవరంలో 40.6 మి.మీ., మాకవరపాలెం 38.8, పాయకరావుపేట 38.6, నర్సీపట్నం 34.6, నాతవరం 24.2, బుచ్చెయ్యపేట 19.2 సబ్బవరం 18.8, కోటవురట్ల 18.6 – ఎస్.రాయవరం 17.4, పరవాడ 17, యలమంచిలి 9.8, కశింకోట 9.4 గొలుగొండ 8.8, అనకాపల్లి 6.4, రోలుగుంట 5.4 నక్కపల్లి 0.8 మునగపాకలో 0.6 మి.మీ.

సర్కారు భూ దాహంపై అన్నదాత కన్నెర్ర

- స్టీల్‌ప్లాంట్‌కు అదనపు భూసేకరణపై కాగిత రైతుల ఆగ్రహం
- తహసీల్దార్ కార్యాలయానికి పాదయాత్ర
- అడ్డుకున్న పోలీసులు.. ఆటోల్లో వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

నక్కపల్లి:

కూటమి సర్కారు భూదాహంపై అన్నదాతలు కన్నెర్ర చేశారు. కంపెనీల కోసం సాగు భూములు ఇచ్చే ప్రసక్తి లేదంటూ రోడ్డెక్కారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం నక్కపల్లి మండలం కాగిత గ్రామం నుంచి రైతులు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. అఖిలపక్షానికి చెందిన కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఎం.అప్పలరాజు, సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, రైతు నాయకులు దేవవరపు శివ, పోతంశెట్టి బాబ్జీ తదితరుల ఆధ్వర్యంలో జాతీయ రహదారి మీదుగా నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్తున్న రైతులను పోలీసులు అడ్డుకున్నారు. జాతీయ రహదారిపై పాదయాత్రలు, ఆందోళనలకు చేయడానికి అనుమతి లేదంటూ ఎస్‌ఐ సన్నిబాబు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వీసం రామకృష్ణకు పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఎట్టకేలకు రైతులంతా ఆటోల్లో నక్కపల్లి చేరుకుని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. భూసేకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం

ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా పరిశ్రమల స్థాపన కోసం నక్కపల్లి మండలంలో 4,500 ఎకరాలను సేకరించింది. ఆర్సెలర్ మిట్టల్ నిప్పల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు అందులో 2200 ఎకరాలను ఇటీవలే ప్రభుత్వం కేటాయించింది. టౌన్‌షిప్ కోసం మరిన్ని భూములు కావాలని మిట్టల్ కంపెనీ కోరడంతో ఏపీఐఐసీ నెల్లిపూడి, కాగిత, వేంపాడు, డీఎల్ పురం గ్రామాల్లో 2565 ఎకరాలు అదనంగా సేకరించేందుకు నిర్ణయించారు. ఒక్క కాగితలోనే జిరాయితీ, ప్రభుత్వ భూములు కలిపి 307 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. రైతులతో గ్రామసభలు నిర్వహించారు. అదనంగా భూములు ఇచ్చేదిలేదని రైతులు తెగేసి చెప్పారు. అయినప్పటికీ గ్రామంలో చెరువు గర్భాలు, గ్రామ కంఠాలు, శ్మశానాలను గుర్తించి సుమారు 80 ఎకరాలు భూ బదలాయింపు కింద ప్రభుత్వానికి కేటాయించడానికి పంచాయతీ తీర్మానం చేయాలని నోటీసులు జారీ చేశారు. దీనిపై రైతుల్లో ఆగ్రహం పెల్లుబుకింది. శనివారం వందలాదిమంది రైతులు ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధపడ్డారు. ఇప్పటికే స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్‌పార్క్ కోసం జాతీయ రహదారి నుంచి నిర్మిస్తున్న రోడ్డుకు కాగితలో సుమారు 40 ఎకరాల జిరాయితీ భూములు ఇచ్చామని, దీన్ని అవకాశం తీసుకుని గ్రామానికి అనుకుని ఉన్న సుమారు 400 ఎకరాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తోందంటూ రైతులు ఆరోపిస్తున్నారు. భూములు ఇస్తే అభివృద్ధి చేస్తామని చెబుతున్నారని, ఇప్పటికే మండలంలో 4500 ఎకరాలు తీసుకున్నారని, పదేళ్లయినప్పటికీ ఒక్క కంపెనీ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో భూములన్నింటినీ దశల వారీగా లాక్కోడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వీసం రామకృష్ణ ఆరోపించారు. కంపెనీలు వస్తే వాటిలో పనిచేసేందుకు అవసరమైన విద్యార్హతలు తమ వద్ద లేవన్నారు. ఈ గ్రామంలో నివసించే వారిలో 70 శాతం మంది వ్యవసాయ రంగంపైన, కూలి పనులపైన ఆధారపడి జీవించేవారేనన్నారు. గ్రామానికి ఆనుకుని ఉన్న భూములు తీసుకుంటే ఎక్కడకెళ్లి బతకాలని ప్రశ్నించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. నక్కపల్లి, పాయకరావుపేట సీఐలు కుమారస్వామి, అప్పన్న, ఎస్‌ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో సుమారు 20 మంది పోలీసులు రైతుల ర్యాలీలో బందోబస్తు నిర్వహించారు. తమ సమస్య చెప్పుకునేందుకు కూడా పోలీసులు అడ్డంకులు కల్పించడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేస్తున్న రైతులు



ర్యాలీ జాతీయ రహదారి పైకి రాకుండా అడ్డుకుంటున్న పోలీసులతో వీసం రామకృష్ణ వాగ్వాదం

ప్రాణాలైనా ఇస్తాం



గ్రామంలో భూములు బలవంతంగా తీసేసుకుంటే ఎక్కడకెళ్లి బతకాలి. అభివృద్ధి చేస్తామంటున్నారు. తీసుకున్న భూముల్లో ఎలాంటి ప్రగతి లేదు. రోడ్డు కోసం గ్రామంలో 40 ఎకరాలు ఇచ్చాం. అలా అని మిగిలిన భూములు తీసుకుంటే ఒప్పుకునేది లేదు. ప్రాణాలు ఇచ్చయినా భూములు కాపాడుకుంటాం.

–పోతంశెట్టి రాజేష్, సర్పంచ్

ప్రభుత్వమా.. రియల్ ఎస్టేట్ వ్యాపారా?



రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకుని ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది. అభివృద్ధి చేస్తామని మోసం చేస్తోంది. పంట భూములను తీసుకుని రైతులను బికారులను చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైతులకు అండగా ఉంటాం. భూములను కాపాడుకుంటాం.

–వీసం రామకృష్ణ, ఎం అప్పలరాజు, అఖిలపక్ష నాయకులు

ఆక్రమించాలని సూస్తున్నారు..



భూములన్ని తీసుకుని మమ్మల్ని ఏం సేద్దామనుకుంటున్నారు. రోడ్డు కోసం కొన్ని భూములు తీసేసుకున్నారు. ఇప్పుడు ఊరిని అనుకుని ఉన్న భూములన్నీ తీసేసుకోవాలని సూస్తున్నారు. తరతరాలుగా ఇవే భూములను నమ్ముకుని బతుకుతున్నాం. పేణాలయినా ఇత్తాం గానీ భూములు మాత్రం వదలం.

–పినపోతుల వెంకలక్ష్మి, కట్టా సీత, రైతులు, కాగిత

క్లుప్తంగా

గంటలోనే పోగొట్టుకొన్న బ్యాగు పట్టివేత



బాధితురాలికి బ్యాగు అందజేస్తున్న కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట : బ్యాగు పోగొట్టుకున్న గంట వ్యవధిలోనే దాన్ని పట్టుకొని బాధితురాలికి పోలీసులు అప్పగించారు. కశింకోట పోలీసులు తమ తక్షణ స్పందనను చాటుకున్నారు. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాల ప్రకారం...అనకాపల్లికి చెందిన బి. రేష్మ అనే ఆటోలో బ్యాగు పోగొట్టుకున్న విషయాన్ని శనివారం సాయంత్రం కశింకోట పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. దానిలో రెండు మొబైల్ ఫోన్లు, రూ.8 వేల నగదు ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆటో దిగినప్పుడు బ్యాగు విషయం గుర్తుకు రావడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో స్పందించి సీఐ సత్వరమే దర్యాప్తు చేపట్టారు. గంట వ్యవధిలోనే జిల్లా ఐటీ కోర్ సహాయంతో కశింకోట మండలం వైపు వెళుతున్న ఆటోలో బ్యాగు ఉన్నట్టు గుర్తించి పట్టుకొన్నారు. సెల్‌ఫోన్లు, నగదుతో సహా బ్యాగును బాధితురాలికి అప్పగించారు. ఈ కేసును ఛేదించడంలో సహకరించిన హెచ్‌సీ జి. మధుబాబు, కానిస్టేబుల్ బి.మహేశ్వరరావును సీఐ అభినందించారు. అలాగే పోలీసుల చొరవను బాధితురాలితోపాటు స్థానిక ప్రజలు అభినందించారు.

పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సమీక్ష



పారిశ్రామిక వేత్తలతో మాట్లాడుతున్న మంత్రి భరత్

అచ్యుతాపురం రూరల్ : పారిశ్రామిక వేత్తలకు అండగా ఉంటామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్ అన్నారు. అచ్యుతాపురం ఏపీఐఐసీ జోనల్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనకాపల్లి జోన్‌లో జరుగుతున్న ప్రాజెక్ట్ పనుల పురోగతిని సమీక్షించారు. పారిశ్రామిక వేత్తలు తెలియజేసిన సమస్యలు ప్రభుత్వం పరిష్కరిస్తుందని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ వర్క్స్ చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇదేం తీరువా బాబూ



మూలపేటలో అధ్వానంగా సాగునీటి కాలువ

- రైతుకు గుదిబండగా.. నీటి తీరువా బకాయిలు
- డిమాండ్ నోటీసుల జారీపై అన్నదాతల ఆగ్రహం
- గ్రామసభల నిర్వహణ ద్వారా రైతులపై వత్తిడి ?

మునగపాక: రైతులపై భారం మోపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది. ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడులకు గాను అన్నదాత సుఖీభవ అందక రైతులు అవస్థలు పడుతుంటే వారిపై మరింత భారం పడేలా ప్రభుత్వం నీటి తీరువా బకాయిల వసూలుకు చర్యలు చేపట్టింది. ఇందు కోసం నోటీసులు పంపడం విమర్శలకు తావిస్తోంది. ఆదుకోవాల్సింది పోయి ఆర్థిక భారం పడేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కాలువల ద్వారా సక్రమంగా నీరు అందే పరిస్థితులే లేనప్పుడు తాము నీటి తీరువా ఎలా చెల్లిస్తామంటూ ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సకాలంలో రైతు భరోసా అందించడంతో పాటు రైతులకు అండగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని రైతులు చెబుతున్నారు.

అన్నదాతలపై భారం రూ.3 కోట్లు

మండల వ్యాప్తంగా 16,771 రైతు ఖాతాలకు సంబంధించి రూ.3 కోట్ల మేర నీటి తీరువా వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా చేసుకున్నారు. ఈమేరకు అన్నదాతలకు డిమాండ్ నోటీసులు జారీ చేస్తున్నారు. గత ఆరు సంవత్సరాలుగా నీటి తీరువాకు రైతులు రూపాయి చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులపై భారం పడేలా చర్యలు చేపట్టింది.ఆదివారంలోగా డిమాండ్ నోటీసులు ప్రతి రైతుకు అందిస్తామంటూ అధికారులు చెబుతున్నారు.

అధ్వానంగా సాగునీటి కాలువలు

మండలంలో సాగునీటి కాలువలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల స్వరూపం కోల్పోతుండగా, మరికొన్ని చోట్ల మురుగునీరు ప్రవహిస్తోంది. ఇంత దయనీయ స్థితిలో కాలువలుండగా నీటి తీరువా బకాయిలు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు పంపడం సరికాదంటూ రైతులు వాపోతున్నారు. కాలువల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టని అధికారులు బకాయిల వసూలుకు వత్తిడి తెస్తుండడం తగదని అన్నదాతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామసభల ద్వారా వత్తిడి ?


రైతులకు అవగాహన కల్పించే పేరుతో తీరువా బకాయిలు చెల్లించేలా వారిపై వత్తిడి తెచ్చేందుకు రెండు రోజుల్లోగా గ్రామసభలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారని తెలిసింది. గ్రామాల వారీగా సభలు నిర్వహించి బకాయిల వసూలుకు సమాయత్తమవుతున్నారు. ఆదివారంలోగా డిమాండ్ నోటీసుల పంపిణీ పూర్తి చేసి సభల నిర్వహణపై దృష్టి సారించనున్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుండగా గ్రామసభలు సక్రమంగా జరుగుతాయా అన్న ప్రశ్న నెలకొంది.

1988 చట్ట ప్రకారం నీటి తీరువా చెల్లింపు ఇలా..

సాగునీటి వనరుల అభివృద్ధే లక్ష్యంగా 1988లో నీటి తీరువా చెల్లింపు చట్టం అమలులోకి తీసుకువచ్చారు. ఈ చట్టం కింద ప్రతి రైతు ఏడాదికొకసారి నీటి తీరువా చెల్లించాలి. వరికి సంబంధించి ఎకరాకు ఒక పంటకు రూ.100, రెండు పంటలకైతే రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. చెరకుకు ఎకరాకు రూ.200 చొప్పున చెల్లించాలి. అయితే గత కొన్నేళ్లుగా నీటితీరువా వసూలు చేయడం లేదు. తాజాగా కూటమి ప్రభుత్వం రైతుల నుంచి నీటి తీరువా బకాయిల వసూలుకు ఉపక్రమించడం విమర్శలకు తావిస్తోంది.

ఐదు గ్రామాలు మినహా..

మండలంలోని 28 రెవెన్యూ గ్రామాలున్నాయి. వాటిలో సాగునీటి వనరులున్న గ్రామాలు 23 కాగా మిగిలిన 5 గ్రామాల్లో రైతులు నీటి తీరువా చెల్లించనవసరం లేదు.చెర్లోపాలెం, రాజుపేట అగ్రహారం, పాటిపల్లి,వెంకటాపురం,టి.సిరసపల్లి గ్రామాల రైతులు మాత్రం నీటి తీరువా పన్ను చెల్లించనవసరం లేదు.ఇతర గ్రామాల రైతులు తప్పనిసరిగా ఈ నీటి తీరువా బకాయిలు చెల్లించాల్సిందేనంటూ అధికారులు తెలిపారు.



నీటి తీరువా చెల్లించాలంటూ అధికారులు పంపిన నోటీసు

రైతులపై భారం తగదు



రైతులపై భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం విచారకరం. ఇప్పటికే వ్యవసాయం భారంగా ఉందనుకుంటే నీటి తీరువా బకాయిలు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు అందజేయడం సరికాదు. రైతులను ఆదుకోవాల్సింది పోయి రైతులపై భారం పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం బాధాకరం.

– నరాలశెట్టి సూర్యనారాయణ, రైతు,ఒంపోలు

ప్రతి రైతు చెల్లించాలి



ప్రతి రైతు నీటి తీరువా బకాయిలు చెల్లించాలి. గ్రామాల్లో సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తాం.సాగునీటి వనరులు అభివృద్ధి చెందాలంటే నీటి తీరువా బకాయిలు చెల్లించాల్సి ఉంది. సంఘాలు బలోపేతం కావాలంటే రైతుల సహకారం అవసరం.సచివాలయాల్లో పన్నులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించే వెసులుబాటు కల్పించాం . ఇప్పటికే రైతులకు డిమాండ్ నోటీసులు పంపించాం.

– పి.సత్యనారాయణ, తహసీల్దార్, మునగపాక

ప్లాస్టిక్ భూతం.. అంతం చేద్దాం

మాకవరపాలెం: ప్లాస్టిక్ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు, ప్రజలు, అధికారులతో కలసి ప్రాథమిక పాఠశాల వరకు చేపట్టిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానుకోవాలన్నారు. లేకుంటే భవిష్యత్ తరాల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేరు చేసి వీటి సేకరణకు వచ్చే క్లాప్ మిత్రలకు అందజేయాలన్నారు.

అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు. స్వచ్ఛాంధ్రపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలసి కలెక్టర్ సహపంక్తి భోజనాలు చేశారు. సీఈవో నారాయణమూర్తి, డీపీవో సందీప్, ఆర్డీవో వి.వి.రమణ, మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు, ఎంపీడీవో చాయాసుధ, తహసీల్దార్ వెంకటరమణ, ఎంఈవోలు జాన్‌ప్రసాద్, మూర్తి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాకవరపాలెం: ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్లాస్టిక్‌ను నిర్మూలిస్తామని శనివారం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేసి, ప్రజల్లో చైతన్యం తీసుకొనిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అండ్ ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఎస్‌వో రామచంద్రరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లి: ప్లాస్టిక్ నిర్మూలన చేయాలని ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

కృష్ణారాయుడిపేట వరకే 12డి, 68డి సర్వీసులు

- అధికారులతో చర్చించి త్వరలో నిర్ణయం
- విశాఖపట్నం ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ పద్మావతి

దేవరాపల్లి: విశాఖపట్నం వయా కొత్తవలస, ఆనందపురం మీదుగా దేవరాపల్లి వెళ్లే మార్గంలో కృష్ణారాయుడిపేట సమీపంలో జీవీఎంసీ కాలువపై గల కల్వర్టు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందని విశాఖపట్నం ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ కె.పద్మావతి తెలిపారు. శిథిలావస్థకు చేరిన కల్వర్టును శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆమె సందర్శించారు. శిథిలావస్థలో ఉన్న కల్వర్టుతో పడుతున్న ఇబ్బందులను ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సులు నిర్దేశించిన సమయంలో చేరుతున్నాయో , లేదో పరిశీలించారు. అనంతరం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న కల్వర్టు ఏ సమయంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా విశాఖపట్నం నుంచి కొత్తవలస మీదుగా దేవరాపల్లికి వచ్చే 12డి, 68డి బస్సులను కృష్ణారాయుడిపేట వరకు మాత్రమే నడపాలని యోచిస్తున్నట్టు చెప్పారు. ఉన్నతాధికారులతో చర్చించి రెండు రోజుల్లో దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మద్దిలపాలెం, సింహాచలం, వాల్తేరు డిపోల నుంచి దేవరాపల్లికి 25 బస్సులు సర్వీస్‌లు నడుస్తున్నాయన్నారు.



దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడుతున్న ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ పద్మావతి

బైక్‌ల దొంగ అరెస్ట్

- ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం

నర్సీపట్నం:ద్విచక్రవాహనాల చోరీ కేసులో ఓ వ్యక్తిని పట్టణ పోలీసులు అరెస్టు చేసి, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. టౌన్ సీఐ జి.గోవిందరావు కథనం ప్రకారం..ఈ ఏడాది మే నెల 8వ తేదీన బలిఘట్టానికి చెందిన సుర్ల లోవరాజు ద్విచక్రవాహనం చోరీకి గురైంది. ఈ సమయంలో లోవరాజు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా శనివారం కృష్ణాపురం రోడ్డులో తనిఖీలు నిర్వహిస్తుండగా కాకినాడ జిల్లా తుని మండలం హంసవరం శివారు సీతంపేట గ్రామానికి చెందిన షేక్ బషీర్ బాషా(23) చోరీకి గురైన మోటారు సైకిల్‌తో పట్టుబడ్డాడు. ఇతను గతంలో పిఠాపురం, సామర్లకోట, తుని, యలమంచిలి, అనకాపల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడ్డాడు. ఈ చోరీలకు సంబంధించిన ఐదు ద్విచక్రవాహనాలను కశిమి రోడ్డులో దాచి ఉంచాడు. నిందితుడి నుంచి మొత్తం ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. షేక్ బషీర్ బాషాపై గాజువాక పోలీసు స్టేషన్‌లో రెండు, పిఠాపురం పోలీసు స్టేషన్‌లో ఒక చోరీ కేసు నమోదయ్యాయి. నిందితుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐలు రమేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ గోవిందరావు, ఎస్‌ఐ రమేష్

చిట్టీలు, వడ్డీల పేరిట మోసగించిన టీడీపీ నేత అరెస్ట్



నిందితుడు దాడిశెట్టి పైడియ్యను అరెస్ట్ చేసిన పోలీసులు



ఠాణాకు వచ్చిన బాధితులకు నచ్చజెబుతున్న సీఐ ధనుంజయరావు,ఎస్ఐ ఉపేంద్ర

- నిందితుడు దాడిశెట్టి పైడియ్యతో సమాధానం చెప్పించాలని బాధితుల డిమాండ్
- యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన
- కొందరు అధికార పార్టీ నాయకులు మద్దతిస్తున్నారని ఆరోపణ

యలమంచిలి రూరల్: చిట్టీలు, డిపాజిట్ల రూపంలో పెద్ద మొత్తంలో నగదు సేకరించి, మోసగించిన యలమంచిలి మున్సిపాలిటీ తెరువుపల్లికి చెందిన టీడీపీ నాయకుడు దాడిశెట్టి పైడియ్య(నానాజీ)ని శనివారం అరెస్టు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. పరారవుతుండగా కొక్కిరాపల్లి హైవే కూడలి వద్ద పట్టుకున్నట్టు చెప్పారు. గత నెల 27న బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడ్ని శనివారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల దర్యాప్తులో నిందితుడు తనకు ఉన్న ఆస్తుల వివరాలు తెలిపాడు.వీటి విలువ సుమారు కోటి రూపాయల వరకు ఉండొచ్చని సమాచారం.అయితే నిందితుడు ప్రజల నుంచి వసూలు చేసిన మొత్తం రూ.4 కోట్ల వరకు ఉంటుందని బాధితులు చెబుతున్నారు.

రహదారిపై ఆందోళన

మాయమాటలతో మమ్మల్ని నమ్మించి, మా కష్టార్జితం దోచుకుని, నిలువునా మోసగించిన టీడీపీ నాయకుడు దాడిశెట్టి పైడియ్య(నానాజీ)తో మా వద్ద తీసుకున్న లక్షలాది రూపాయల డబ్బు గురించి సమాధానం చెప్పించాలని డిమాండ్ చేస్తూ తెరువుపల్లి గ్రామస్తులు శనివారం రాత్రి యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఠాణా ఎదుట బైఠాయించి నిందితుడ్ని తమకు చూపించాలని కోరారు. నిందితుడితో మాట్లాడేందుకు బాధితులను పోలీసులు అనుమతించకపోవడంతో ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పైడియ్యకు తమ గ్రామానికే చెందిన కొందరు అధికారపార్టీ నాయకులు మద్దతిస్తున్నారని బాధితులు ఆరోపించారు.అంతా చట్టప్రకారం జరుగుతుందని,నిందితుడు,అతని కుటుంబ సభ్యులకు ఏఏ ఆస్తులున్నాయో తెలుసుకునేందుకు సంబంధిత అధికారులకు లేఖలు రాశామని, సంయమనం పాటిస్తే నిందితుడికి ఉన్న ఆస్తుల వివరాలన్నీ తెలుస్తాయని, న్యాయస్థానం ద్వారా బాధితులకు న్యాయం జరుగుతుందని యలమంచిలి సీఐ ధనుంజయరావు బాధితులకు వివరించి, నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.అయినప్పటికీ బాధితులు ససేమిరా అంటూ ఠాణా ఎదుట బైఠాయించి నిందితుడ్ని మా ఎదుట ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ రాత్రి 10 గంటల వరకూ ఆందోళన కొనసాగించారు.బాధితుల్లో ఎక్కువమంది మహిళలు ఈ సందర్భంగా వారిని నిందితుడు ఎలా మోసగించాడో,ప్రస్తుతం వారంతా ఎంత ఇబ్బంది పడుతున్నారో చెప్పుకుని కన్నీటిపర్యంతమయ్యారు. కొందరు అధికారపార్టీ నాయకులు నిందితుడికి మద్దతునిస్తున్నారని కొందరు బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి రోజాపై టీడీపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు



- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ

దేవరాపల్లి: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు ఆర్.కె. రోజాపై టీడీపీ నాయకుడు, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈర్లె అనురాధ అన్నారు. మాజీ మంత్రి రోజాపై అసభ్య పదజాలంతో, సభ్య సమాజం తల దించుకునేలా విమర్శించడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. దేవరాపల్లి మండలం తారువలో శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్లు స్పందించి టీడీపీ ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకోవాలని అనురాధ డిమాండ్ చేశారు. కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదన్నారు. మహిళల పట్ల టీడీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని ఆమె చెప్పారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి రామానాయుడు

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టంలో నిర్మించిన సీసీ రోడ్లను రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం ప్రారంభించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి వార్డులో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీపం పథకం ద్వారా మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు. వచ్చేనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామన్నామని చెప్పారు. 2025 చివరి నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్. రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్, మార్కెట్ యార్డు చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జెడ్పీటీసీ సుకల రమణమ్మ పాల్గొన్నారు.

చోడవరంలో..

చోడవరం: రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు చోడవరంలో శనివారం జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల కోసం వివరించారు. చోడవరం కాలేజీ ఆవరణంలో జరిగిన జాబ్‌మేళాను పరిశీలించి, వీలైనంత ఎక్కువమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మేళాకు వచ్చిన కంపెనీలను మంత్రి కోరారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి రామానాయుడు

క్లుప్తంగా

ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామికి వజ్ర కవచం తోపాటు వివిధ రకాల పూలమాలలతో దేదీప్యమానంగా అలంకరించి శనివారం భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ హానికరం



ర్యాలీ చేస్తున్న జోనల్ కమిషనర్, సిబ్బంది

అనకాపల్లి టౌన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికే కాకుండా మానవుడి ఆరోగ్యానికి హానికరమని జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు. పట్టణంలోని స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా ఎండ్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే థీమ్‌తో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 20 మైక్రాన్స్ కంటే తక్కువగా ఉండే ప్లాస్టిక్ సంచులను వాడొద్దన్నారు. ప్లాస్టిక్ స్పూన్స్, ప్లేట్లు వాడకూడదన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ఆర్ రవికుమార్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవం నేడు



కశింకోట: స్థానిక శారదానది అవతల పాలాల్లో మోదకొండమ్మ ఉత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి పూజలు జరుగుతాయన్నారు. కోలాటాలు, చిటికెన భజనలు, తోడపెద్దు సేవ వంటి కార్యక్రమాలతో శారద వంతెన వద్ద నుంచి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు ఉత్సవంలో పాల్గొవాలని కోరారు.

నూకాంబిక సేవలో ఏపీ టిడ్కో చైర్మన్



అమ్మవారిని దర్శించుకున్న ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే రామకృష్ణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో కె.ఎల్.సుధారాణి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), టిడ్కో హౌసింగ్ ఎస్సీ డి. నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు అందజేసేందుకు కృషి



మాట్లాడుతున్న మోహన్‌రావు

అనకాపల్లి: ఖరీఫ్ పంటలు వేసుకునేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, వారికి విత్తనాలు అందజేసేందుకు కృషి చేస్తామని అనకాపల్లి డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు తెలిపారు. స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో డివిజన్ పరిధిలో అనకాపల్లి, మునగపాక, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లోని రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు కావలసిన విత్తనాలు, పరికరాలు అందుబాటులో ఉంచాలని కోరారు. డీపీఎం లచ్చన్న, రీజనల్ టెక్నికల్ అధికారి ప్రకాష్, ఏడీఏ సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయ శాఖ అధికారి రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

- నిరుపయోగంగా ప్రభుత్వ స్థలాలు
- కొత్త భవనాలు నిర్మించని ప్రభుత్వం
- కొన్నేళ్లుగా అద్దె భవనాల్లో కార్యకలాపాలు
- ప్రతి నెలా లక్షలాది రూపాయల అద్దె భారం



శిథిలావస్థకు చేరుకున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



శిథిలావస్థకు చేరుకున్న పాత కోర్టు భవనం

అనకాపల్లి: జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనకాపల్లిలో వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు అద్దె కొంపల్లో అరకొర సౌకర్యాలతో నడుస్తున్నాయి. కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో కొత్తగా భవనాలు నిర్మించే ప్రయత్నం చేయడం లేదు. దాంతో ఆ స్థలాలు నిరుపయోగంగా మారి ఆక్రమణకు గురయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తమవుతోంది. పైగా పిచ్చిమొక్కలు పెరిగిపోయి, విషసర్పాలకు నిలయంగా మారాయి. వీటిని కొంతమంది బహిర్భూమిగా మార్చేశారు.

వీఆర్వోల భవనం..

సబ్ రిజిస్ట్రార్, పాతకోర్టు, వీఆర్వోల భవనాలు ఒకదానికొకటి ఆనుకుని ఉండడంతో రెండెకరాల స్థలం ఉండే అవకాశం ఉంది. ఈ స్థలంలో ప్రభుత్వ భవనాలు నిర్మించినట్లయితే మూడు భవనాలు ఉంటూ మరికొన్ని భవనాలకు అద్దెకు ఇచ్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఈ స్థలం నిరుపయోగంగా ఉండడంతో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

అన్ని భవనాలు ఒకే చోట

బ్రిటిష్ పాలనలో గాంధీనగరంలో ఆర్అండ్‌బీ బంగ్లాను ఏర్పాటు చేశారు. అనకాపల్లికి వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, రాష్ట్ర నాయకులు రాత్రి సమయంలో ఇక్కడ బస చేసేందుకు ఎంతగానో ఉపయోగపడేది. ప్రశాంతమైన వాతావరణంలో పచ్చని మొక్కలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అరెకర ప్రభుత్వ స్థలం నిరుపయోగంగా మారింది. పట్టణంలో ప్రభుత్వ స్థలాల్లో జిల్లా ప్రభుత్వ శాఖ కార్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, పాత కోర్టు, వీఆర్ఏలు స్థలం, ప్రస్తుతం వినియోగంలో ఉన్న సబ్ జైలు, తహసీల్దార్, ఎంపీడీవో, డీఆర్‌డీఏ, ఉత్తర సబ్ ట్రెజరీ కార్యాలయాల స్థలాలు ఒకదాని పక్కన మరొకటి ఉన్నాయి. ప్రభుత్వం మొత్తం స్థలంలో అంచెలంచెలుగా జిల్లా భవనాలు నిర్మిస్తే ఎంతగానో ఉపయోగపడతాయి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం...

అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రైవేట్ భవనంలోనికి మార్పు చేశారు. మూడు సంవత్సరాలు క్రితం అక్కడ నుంచి జాతీయ రహదారి కొప్పాక ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్‌కు తరలించారు. ప్రతి నెలా సబ్- రిజిస్టర్ కార్యాలయానికి సంబంధించి అద్దె రూపంలో వేలాది రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తోంది.

పాత కోర్టు భవనం....

పాతకోర్టు భవనం నడిబొడ్డున ఉండేది. శిథిలావస్థకు చేరుకోవడంతో 25 ఏళ్ల క్రితం పట్టణంలో మెయిన్ రోడ్డు పాత కొణతాల ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాలలోకి మార్చారు. ప్రతి నెలా లక్షలాది రూపాయలు ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అద్దె నిమిత్తం చెల్లిస్తుంది. వీటితోపాటు సబ్ రిజిస్ట్రార్, వీఆర్ఏల కార్యాలయాలు అద్దె కొంపల్లోనే ఉన్నాయి.



శిథిలావస్థకు చేరుకున్న ఆర్అండ్‌బీ బంగ్లా

పిచ్చిమొక్కలతో న్యాయమూర్తుల భవనాలు...

మండలంలో జాతీయ రహదారి కొత్తూరు రూరల్ పోలీస్ స్టేషన్ పక్కన న్యాయమూర్తుల నివాసాల కోసం భవనాలను బ్రిటిష్ కాలంలో నిర్మించారు. ఇవి శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం ఈ భవనాలు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి.



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న న్యాయమూర్తుల పాతభవనం

ప్రభుత్వ స్థలాలను ఉపయోగించుకోవాలి



జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత అనకాపల్లి పట్టణానికి ఎంతో ప్రాముఖ్యత పెరిగింది. పట్టణంలో నడిబొడ్డున ప్రధానమైన సబ్-రిజిస్ట్రార్, కోర్టు, వీఆర్ఏల స్థలం నిరుపయోగంగా ఉన్నాయి. శిథిలావస్థకు చేరుకున్న భవనాలు పూర్తిగా తొలగించి కొత్త భవనాలు నిర్మించాలి.

– కల్యాణ్ చక్రవర్తి, అనకాపల్లి...

అద్దె భవనాలతో ప్రజాధనం ఖర్చు



20 సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. దాంతో కోట్లాది రూపాయలు ప్రజాధనం వృథాగా ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలి.

– పి.మధు, అనకాపల్లి

అందరికీ 'తల్లికి వందనం' వర్తింపజేయాలి

ఎంఈవోను కోరిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎంఈవో-2 కోటేశ్వరరావుతో మాట్లాడుతున్న జాజుల రమేష్

అనకాపల్లి: తల్లికి వందనం పథకాన్ని కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి అమలు చేస్తామని చెప్పి మిగిలిన వారికి ఎందుకు నగదు ఇవ్వడం లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ విమర్శించారు. స్థానిక ఉడ్‌పేట ఎంఈవో కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఎంఈవో-2 కోటేశ్వరరావును కలిసి తల్లికి వందనం పథకాన్ని ప్రతి విద్యార్థికి అమలు చేయాలని శనివారం ఆయన కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లికి వందనం నగదు అందని విద్యార్థుల తల్లులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ న్యాయం జరగడం లేదని వాపోయారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వలంటీర్ వ్యవస్థ ద్వారా అమ్మఒడి పథకాన్ని అర్హులైన వారికి సకాలంలో అమలు చేశామన్నారు. కూటమి పాలనలో ఒక ఏడాది మాత్రమే వేశారని, ఒకే ఇంట్లో ముగ్గురు ఉంటే, ఒక విద్యార్థికి మాత్రమే నగదు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, నాయకులు కారుకుండి కన్నబాబు, కోన ఉమ, డొంక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్లు మరమ్మతులు చేయండి

83వ వార్డు కార్పొరేటర్ పరిధిలో తాగునీటి పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ కోరారు. స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ వాటర్ విభాగం ఏఈ హరీష్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. వార్డు పరిధిలో లక్ష్మీదేవిపేట మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మి స్వగృహం వద్ద మినీ వాటర్‌ట్యాంక్, ఏఎంసీ కాలనీలో వైఎస్సార్‌సీపీ అపార్టుమెంట్, నాగవంశంవీధి, పెద్ద వీధిలో తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయని వాపోయారు. దాంతో ఆయా ప్రాంతాలకు నీరు అందంలేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జిగా మాణిక్యాలరావు



బీఎస్పీ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి: బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జిగా సూదికొండ మాణిక్యాలరావు నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందేల గౌతమ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షునిగా గంటా సూరిబాబు, ఉపాధ్యక్షుడిగా కంకణాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పరవాడ అప్పారావు, కార్యదర్శిగా తాటిపూడి గురుమూర్తి, కోశాధికారిగా తాత్తర సూకరాజు, జిల్లా అడ్వైజర్లుగా ఇ.సత్యనారాయణ, సుహాసిని నియమితులయ్యారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి ప్రైవేట్ హాల్లో ఉత్తర్వుల ప్రతులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ తమ మీద నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

స్వచ్ఛతే ఆరోగ్యానికి పునాది



ఎస్పీ కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి: 'స్వచ్ఛతే ఆరోగ్యానికి పునాది అని, ప్రతి ఒక్కరికీ పరిశుభ్రతపై అవగాహన కల్పించటం పోలీసుల బాధ్యతగా తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ నివాస ప్రదేశాలు, కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. వర్షాలు పడుతున్న సమయంలో ప్రజలు వ్యాధులు బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు వాడకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు బాల సూర్యారావు, టి.లక్ష్మి, ఎస్ఐలు ప్రసాద్, రమణయ్య, అంజిబాబు, సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోతే ఎలా?

- ప్రభుత్వం మారితే అధికారిక కార్యక్రమాలకు పిలవరా?
- అధికారులపై జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు ఆగ్రహం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు



హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు

కశింకోట: రాజ్యాంగ బద్ధంగా ప్రజల నుంచి ఎన్నికైన ప్రతినిధులకు అధికారులు ప్రొటోకాల్ పాటించకపోతే సహించేది లేదని జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు హెచ్చరించారు. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో కొందరు అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడం సరి కాదన్నారు. ప్రజా ప్రతినిధులు వచ్చినప్పుడు వారిని గౌరవంగా ఆహ్వానించి తమ దృష్టికి తీసుకువచ్చే ప్రజా సమస్యలను విని సాధ్యాసాధ్యాలను పరిశీలించి పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కొత్తగా వచ్చిన అధికారులు ఇకనైనా ప్రొటోకాల్ ప్రకారం వ్యవహరించి స్థానిక ప్రజా ప్రతినిధులను గౌరవించాలన్నారు. తమ కన్నూరుపాలెంలో స్కూలు అభివృద్ధి విషయాన్ని తనకు తెలియజేయలేదన్నారు. దీంతో ఎంఈవో కె.ఎస్.ఎన్. మూర్తి బదులిస్తూ ఈ విషయం తమకు కూడా తెలియజేయలేదన్నారు. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు మాట్లాడుతూ శాశ్వతంగా ఉండే అధికారులు ఇకనైనా రాజకీయాలకు అతీతంగా ప్రొటోకాల్ పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాళ్లపాలెం సంత, పీహెచ్‌సీల వద్ద విచ్చలవిడిగా బెల్టుదుకాణాలు ఏర్పాటు చేసి మద్యాన్ని విక్రయిస్తున్నారని, వీటిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని కోరారు. ఉగ్గినపాలెం సర్పంచ్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో బెల్టు దుకాణాలు ఉన్నాయని, సీసాకు రూ.50 అదనంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల పేదలు నష్టపోతున్నారన్నారు. బెల్టు దుకాణాలు నివారించి అధికారిక దుకాణాల్లో నాణ్యమైన మద్యాన్ని సరసమైన ధరలకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో ఎక్సైజ్ ఎస్ఐ కె.ఎస్. గణేష్ స్పందిస్తూ రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే బెల్టు దుకాణాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 14405 ద్వారా ఫిర్యాదు చేస్తే వారి పేరు గోప్యంగా ఉంచి బెల్టు దుకాణాల నివారణకు తప్పక చర్యలు చేపడతారన్నారు. తహసీల్దార్ సిహెచ్. తిరుమలరావు మాట్లాడుతూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. బయ్యవరంలో మాత్రమే రీ-సర్వే పూర్తి కావలసి ఉందన్నారు. మిగిలిన గ్రామాల్లో పూర్తి అయిందన్నారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి మాట్లాడుతూ కశింకోటలో కొన్ని భూముల రికార్డులు తప్పులు తడకగా ఉన్నాయని, వాటిని సరి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉగ్గినపాలెం సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామంలో భూముల రీసర్వే సరిగ్గా జరగలేదని, అర్హులైన రైతుల రికార్డులను తప్పులు లేకుండా సవరించి అందించాలన్నారు. ఒకే కుటుంబంలో సభ్యులు ఎవరికైన వంద రోజుల ఉపాధి పని దినాలు కల్పించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మండలంలో ప్లాస్టిక్ నిషేధానికి ఎంపీపీ కలగా లక్ష్మి ప్రతిపాదనకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఎంపీడీవో వివి రవికుమార్, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, డిప్యూటీ ఎంపీడీవో తోటారావు, ఎంపీటీసీ సభ్యులు ఇందలి హేమలత, చెవ్వేటి చెల్లయ్యమ్మ, గొన్నా నాగసత్యనారాయణ, సర్పంచ్‌లు మంత్రి జయ రజని, కోన నాయుడు, కలిగెట్ల సూకరత్నం దేముళ్లు, హౌసింగ్ ఏఈ బి. శ్రీనివాసరావు, ఐసీడీసీ సీడీపీవో ప్రభావతి, పశు వైద్యాధికారులు చైతన్యమణి, ఆల్ఫోన్సా జార్జ్, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి హనుమాన్ పాదుక అర్చన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న సాయి భక్తులు

అనకాపల్లి టౌన్: భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి వేడుకలు సందర్భంగా ఇంటింటా వంద రోజుల పూజల్లో భాగంగా సత్యసాయి హనుమాన్ పాదుక అర్చన కార్యక్రమం గవరపాలెంలో భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బొడ్డేడ శివ మాట్లాడుతూ సత్యసాయి బాబా ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేఎం నాయుడు, బొడ్డేడ దుర్గ, నడిశెట్టి మధు, ఆడారి బుచ్చి రాము, సంకర వెంకటేశ్వరావు, పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కాండ్రేగుల శ్యామ్, సాయి భక్తులు పాల్గొన్నారు.

రైతు బజార్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కొణతాల హరనాథ్‌బాబు

అనకాపల్లి: దళారుల చేతిలో మోసపోతున్న రైతుల కోసం పట్టణంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యం కలిగిన అనకాపల్లి పట్టణానికి నేటికి రైతుబజార్ లేకుండా పోయిందన్నారు. గ్రామాల్లో పండించిన కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకోవడానికి రైతు బజార్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. దళారుల వ్యవస్థను నిర్మూలించాలంటే రైతు బజారులు ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక డీసీఎంఎస్ ఖాళీ స్థలంలో రైతు బజార్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతం ఆర్టీసీ బస్టాండ్ కాయగూరల మార్కెట్ సమీపంలోనే కావడంతో రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడుతుందన్నారు. డీసీఎంఎస్ స్థలానికి మంచి ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు, సీపీఐ నేత మత్తుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల నిషేధం

తుమ్మపాల: పరిసరాల పరిశుభ్రత బాధ్యతగా కాకుండా మన సంస్కృతిలో భాగంగా మారాలని, తద్వారానే ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమని కలెక్టరేట్ పరిపాలన అధికారి టి.విజయ్‌కుమార్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్రలో భాగంగా కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బంది శనివారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్ర దినంగా పాటిస్తూ పరిసరాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇకనుంచి అన్ని కార్యాలయాలలో, అధికారిక సమావేశాల్లో, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపారు. దీని ప్రత్యామ్నాయంగా స్టీల్, గాజు బాటిల్స్ వినియోగించాలని కోరారు. కార్యాలయ ఫైళ్లు, టేబుళ్లు, కార్యాలయ పరిసరాలను రోజూ శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి తెలిపారు. అంతకు ముందు సిబ్బందితో కలిసి స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

అనకాపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పారిశుద్ధ్య కార్మికులు నిత్యం కృషి చేస్తున్నారని ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) జిల్లా అధికారి వి.ప్రవీణ తెలిపారు. స్థానిక అనకాపల్లి డిపో ఆవరణలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం స్థానిక బస్ స్టేషన్‌లో పారిశుధ్య సిబ్బందిని ఆమె శాలువాలతో సత్కరించి, పూలను అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి వ్యక్తి కృషి చేయాలని, ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని కోరారు. నిత్యం వేలామంది ప్రయాణించే కాంప్లెక్స్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ జీవీ గౌరీ, మెకానికల్ ఏఈ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో వర్షం

కశింకోట: మండలంలో శనివారం వర్షం కురిసింది. దాంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముకొని వర్షం కురిసింది. కొన్ని రోజులుగా కాస్తున్న ఎండల తీవ్రత నుంచి జనానికి ఉపశమనం కలిగింది.

రోగులకు సకాలంలో వైద్య సేవలు



రోగులను పరిశీలిస్తున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ నాయుడు

అనకాపల్లి: వర్షాలు పడుతున్న కారణంగా గ్రామీణ ప్రజలు వివిధ రకాల వ్యాధులు బారిన పడే అవకాశాలు ఉన్నాయని, ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డి.డి. నాయుడు తెలిపారు. శనివారం స్థానిక ఆస్పత్రి ఐసీయూలో రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వల్ల వచ్చే డెంగ్యూ రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని కోరారు. డెంగ్యూ ఏడిస్ దోమకాటు వల్ల డెంగ్యూ జ్వరం వస్తుందన్నారు. 103, 104 డిగ్రీలు జ్వరం ఉంటుందని, తలనొప్పి, కండరాల నొప్పి, కంటినొప్పితోపాటు ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గుతుందన్నారు. సకాలంలో వైద్యం అందని రోగులకు మెదడు, మూత్రపిండాలు, కాలేయం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

పరవాడ: స్థానిక సినిమా హాలు జంక్షన్‌లో నివాసం ఉంటున్న కూండ్రపు సత్యారావు కుమారుడు కూండ్రపు సాయి సాత్విక్ (15) శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదని తండ్రి సత్యారావు శనివారం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయిసాత్విక్ సొంత్యాం దగ్గర విశ్వ స్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో అలిగి ఉత్తరం రాసి శనివారం మధ్యాహ్నం 1.30 సమయంలో సినిమా హాలు కూడలిలో ఆటో ఎక్కి స్టీల్ ప్లాంట్ వైపు వెళ్లినట్లు ఆ ఫిర్యాదులో సత్యారావు పేర్కొన్నారు. సాత్విక్ 6 అడుగుల ఎత్తు, చామన ఛాయ, సైడ్ క్రాఫ్‌తో ఉంటాడు. మెరూన్ కలర్ నెక్ టీ షర్టు, బ్లాక్ కలర్ ఫుల్ ప్యాంటు ధరించి ఉన్నాడు. సాయి సాత్విక్‌ను గుర్తించిన వారు 9440796038 నంబరుకు సమాచారం అందించాలని సీఐ ఆర్.మల్లికార్జునరావు కోరారు.